ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపుతా

- ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- నాయుడుపాలెంలో రెండో రోజు ముమ్మర ప్రచారం
- హారతులిచ్చి స్వాగతం పలికిన మహిళలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు హారతులిస్తున్న మహిళలు



పాతరాజన్నపాలెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ఎమ్మెల్యేగా తనకు మరొక అవకాశం కల్పిస్తే పెందుర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నాయుడుపాలెంలో రెండో రోజు శుక్రవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయనకు గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య గజమాలతో స్వాగతం పలికారు. స్థానిక మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నాయుడుపాలెం, మెట్టపాలెం, పాతరాజన్నపాలెం, బందారుపాలెం, హస్తినాపురం, గంగునాయుడుపాలెం, వెంకటపతిపాలెం, రాముడిగారి గ్రామం, సిమ్మన్నగారి గ్రామం, కొరంగివానిపాలెం, కొండవానిపాలెం, గొల్లపేట గ్రామాల్లో విస్తృతంగా



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. గత ఐదేళ్ల కాలంలో నాయుడుపాలెం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు రూ. 20 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. చంద్రబాబు మళ్లీ దొంగ హామీలు గుప్పిస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. టీడీపీ ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ మాత్రం ప్రజలతోనే పొత్తు పెట్టుకుందన్నారు. వారి ఆశీస్సులతో మళ్లీ జగనన్న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని అదీప్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, పార్టీ నాయకుడు గండి రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, నాయకులు పైల అప్పలనాయుడు, గొర్లి గోపి, బొంది అచ్చిబాబు, బండారు కృష్ణబాబు, కన్నూరు నేస్తాలు, బండారు శ్రావణ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, యమహా నాయుడు, గంగరాజు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుంటే మళ్లీ ఇంటి వద్దకే పింఛన్లు



దివ్యాంగురాలి సమస్యలు వింటున్న అదీప్‌రాజ్

శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రజలను కలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్ననే మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. వృద్ధులు, వికలాంగులను నేరుగా కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్నను గెలిపించుకుంటే వృద్ధాప్య, దివ్యాంగ, ఒంటరి మహిళ వంటి పింఛన్లన్నీ నేరుగా వలంటీర్లు మీ ఇంటికే తెచ్చి అందించే కార్యక్రమం మొదలవుతుందని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

ఘనంగా సింహవల్లీ తాయారు తిరువీధి



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం తిరువీధి ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీలో వేంజేపచేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించి హారతి సమర్పించారు. కార్యక్రమాన్ని అర్చకుడు అప్పాజీ, పారాయణదారులు నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ : రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఫార్మాసిటీ కార్మికులకు చల్లని మంచినీరు, మజ్జిగ అందజేయడానికి ముందుకు వచ్చిన రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ బక్షి, లైజనింగ్ అధికారి పి. రాఘవరెడ్డి, ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె. శ్రీకాంత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రావాడలో రాజీనామాలు చేసిన వలంటీర్లు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో, వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వెంట నడిచి ఆయన విజయానికి కృషి చేయాలని నిర్ణయించిన రావాడ గ్రామానికి చెందిన 11 వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వలంటీర్లు రవి, దివ్య, పైడిరాజు, మురళి, విజయలక్ష్మి, కిరణ్, శ్రీను, రమాదేవి, కృష్ణవేణి, పి.అప్పలరాజు, లావణ్య స్వచ్ఛందంగా చేసిన రాజీనామాలను పరవాడ ఎంపీడీవోకు అందజేశారని మండల వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

సబ్బవరం: నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్‌సీపీ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జీఎస్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని తెలిపారు.

బంగారమ్మ నూతన ఆలయ నిర్మాణ పనుల ప్రారంభం



పూజలు చేస్తున్న పండితులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. రూ. 35 లక్షలతో సింహాచలం దేవస్థానం నూతన ఆలయ నిర్మాణం చేపట్టనుంది. ఈ మేరకు పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పలువురు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

అన్నపూర్ణేశ్వరిగా లలితాంబిక



అన్నపూర్ణేశ్వరి అవతారంలో లలితాంబిక

సబ్బవరం: ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబిక అమ్మవారి నవ రాత్రి ఉత్సవాలను నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకున్న వారికి కష్టాలు తీరడంతోపాటు ఆయురారోగ్యాలు ప్రాప్తిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలియజేశారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వెంకన్నకు క్షీరాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష క్షీరాభిషేకం, పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో అప్పన్న కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలతో కల్యాణ మండపం కిక్కిరిసింది. వారికి కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభం

వెయ్యి మందికి ఉపాధి కల్పన

టీవీరోడ్డు: ఉత్తరాంధ్రతో పాటు కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు ఒక్క రోజులో కిరాణా సరకులను డెలివరీ చేసేందుకుగాను ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్ ఫిల్‌మెంట్ కేంద్రాన్ని యలమంచిలి మండలం యర్రవరం గ్రామంలో ప్రారంభించినట్టు సంస్థ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ వివరాలను మీడియాకు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రోజుకు 8వేల ఆర్డర్లను డెలివరీ చేయగలగుతామన్నారు. ఇందులో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ మార్కెట్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇది రెండో కేంద్రమని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా నేరుగా ఉపాధి కల్పించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కూడా ఉపాధి కల్పనకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయవాదుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం విశాఖ న్యాయవాదుల నూతన సంఘ పరిచయ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు న్యాయవ్యవస్థకు రెండు కళ్లుగా వివరించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షులు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలను తక్షణం పరిష్కరిస్తూ అందరికీ అవసరమైన మంచి సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి డి. నరేష్, సీనియర్ సభ్యుడు అప్పారావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది కేశ ప్రగడ వెంకట నరసింహమూర్తి, బార్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, చింతపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరిసిన విద్యా కుసుమాలు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపారు. పెందుర్తి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మిశ్రమ ఫలితాలు సాధించారు. తొలి ఏడాది విద్యార్థులు 26 శాతం మంది మాత్రమే పాస్ కాగా ద్వితీయ ఏడాది విద్యార్థులు 41 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్ తొలి ఏడాది 184 మంది పరీక్షలకు హాజరు కాగా.. 47 మంది పాస్ అయ్యారు. ఒకేషనల్‌లో 196 మందికి గాను 117 మంది పాస్ మార్కులు సాధించారు. ద్వితీయ ఏడాది జనరల్‌లో 143 మందికి గాను 59 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 188 మందికి 130 మంది ఉత్తీర్ణత సాధించారు.



జె.జశ్వంత్ | బి.కేశవ | పి.సాయిప్రకాష్ | వై.పూర్ణప్రవీణ్‌కుమార్ | ఆర్.నిరంజన్

సింహాచలం గురుకుల విద్యార్థుల సత్తా

సింహాచలం: సింహాచలంలోని మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఫస్టియర్ ఎంపీసీ నుంచి 49 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 46 మంది ఉతీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. బైపీసీ నుంచి 15 మంది హాజరుకాగా.. 14 మంది, సీఈసీ నుంచి 27 మంది హాజరు కాగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో 449 మార్కులతో జె.జశ్వంత్, బి.కేశవ టాపర్‌లుగా నిలిచారు.

- సెకండియర్ ఎంపీసీ నుంచి 39 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ నుంచి 24 మంది హాజరు కాగా 22 మంది, సీఈసీ నుంచి 15 మంది హాజరు కాగా.. 13 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో వై.పూర్ణప్రవీణ్‌కుమార్ 974 మార్కులు, ఎంపీసీలో ఆర్. నిరంజన్ 966 మార్కులు, సీఈసీలో పి.సాయి ప్రకాష్ 869 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచారు.

పరవాడ కళాశాల.. 61 శాతం



వి.లోకేష్ కల్కి | కె.శ్రీసత్య

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 138 మంది విద్యార్థులు హాజరు కాగా.. 84 మంది(61 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వి.లోకేష్ కల్కి 1000/951 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఎస్.శ్వేత 876 మార్కులు సాధించింది. బైపీసీలో అత్యధికంగా కె.శ్రీసత్య 891 మార్కులు, పి.నిఖిత 872 మార్కులు సాధించారు.

- ఫస్టియర్ పరీక్షలకు 155 మంది హాజరు కాగా.. 55 మంది(36 శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు. ఎంపీసీలో నీతు కుమారి 445 మార్కులు, ఎస్.రమ్య 432 మార్కులు, వి.జ్యోత్స్న 416 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు.

రెసిడెన్సియల్ కాలేజీ.. 96.4 శాతం

తానాంలోని ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఆర్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 110 మంది హాజరు కాగా.. 106 మంది(96.4 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 134 మందికి 130 మంది(97 శాతం) పాస్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తెలిపారు.



కె.అనూష | కె.అంజలి | ఎన్.సిరి | ఐ.మధులత | ఎస్.కె.రిజ్వానా | డి.అర్జున | జి.ప్రవీణ్‌కుమార్ | కె.జగదీష్ | ఎస్.జశ్వంత్

సబ్బవరం కళాశాల ఉత్తీర్ణత 69 శాతం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 485 మంది పరీక్షలకు హాజరు కాగా.. 338 మంది పాస్ కావడంతో 69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెకండియర్ జనరల్ గ్రూప్‌ల నుంచి 73 మందికి 53 మంది(73 శాతం), ఫస్టియర్ నుంచి 84 మందికి 45 మంది విద్యార్థులు(54 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఒకేషనల్ గ్రూప్‌ల నుంచి 160 మందికి 124 మంది(73 శాతం), ఫస్టియర్ ఒకేషనల్ నుంచి 168 మందికి 116 మంది విద్యార్థులు(70 శాతం) ఉత్తీర్ణత పొందారు.

- సెకండియర్ ఒకేషనల్ గ్రూప్ నుంచి జి.రుబీన్ అత్యధికంగా 1000/968 మార్కులు సాధించగా.. ఫస్టియర్ నుంచి పి.శ్రావణి 500కి 476 మార్కులు సాధించింది.
- ద్వితీయ సంవత్సరం జనరల్ గ్రూప్ నుంచి జి.అశ్రిత అత్యధికంగా 1000/892 మార్కులు సాధించగా.. ప్రథమ సంవత్సరం నుంచి కె.సౌమ్యశ్రీ అత్యధికంగా 470కి 436 మార్కులు సాధించింది.

సబ్బవరం కేజీబీవీ.. 97 శాతం

సబ్బవరం కేజీబీవీ నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 32 మంది విద్యార్థులు హాజరు కాగా 31 మంది (97 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో మృదుల తెలిపారు. సెకండియర్ నుంచి కె.అనూష 1000/925 మార్కులు, కె.అంజలి 1000/920 మార్కులు సాధించారు.

- ఫస్టియర్ నుంచి 33 మందికి 29 మంది (88 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఎన్.సిరి 440/412 మార్కులు, ఐ.మధులత 440/395 మార్కులు, ఎస్.కె.రిజ్వానా 440/395 మార్కులు సాధించినట్లు ఎస్‌వో చెప్పారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం.. 100 శాతం

సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 20 మంది విద్యార్థులు హాజరు కాగా.. నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్.వి.వి.సత్యారావు తెలిపారు. డి.అర్జున 1000/888 మార్కులు, జి ప్రవీణ్‌కుమార్ 853 మార్కులు సాధించారు.

- ప్రథమ సంవత్సరం నుంచి 18 మంది హాజరు కాగా.. 17 మంది విద్యార్థులు(94.4 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కె.జగదీష్ 500/448 మార్కులు, ఎస్.జశ్వంత్ 395 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 17 నుంచి జూలై 3వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 18 నుంచి జూలై 4వ తేదీ వరకు నడుస్తుంది.

- భువనేశ్వర్-యల్హంక(02811) స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు యల్హంక వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు నడుస్తుంది. యల్హంక-భువనేశ్వర్(02812) స్పెషల్ యల్హంకలో ప్రతీ సోమవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 15 నుంచి మే 27వ తేదీ వరకు నడుస్తుంది.
- హౌరా-యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ గురువారం హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.45గంటలకు బయలుదేరి అదేరోజు మధ్య రాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. యశ్వంత్‌పూర్- హౌరా (02864) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారం యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి మరసటి రోజు మధ్యాహ్నం 1.25 గంలకు హౌరా వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ వరకు నడుస్తుంది.
- కొచ్చువేలి-షాలిమర్(06081) స్పెషల్ ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయలుదేరి ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 12 నుంచి మే 31వ తేదీ వరకు నడుస్తుంది. షాలిమర్-కొచ్చువేలి(06082) స్పెషల్ షాలిమర్‌లో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి వెళ్తుంది. ఈ రైళ్లు ఈ నెల 15 నుంచి జూన్ 3వ తేదీ వరకు నడుస్తుంది.
- న్యూటిన్‌సుకియా-బెంగళూరు(05952) స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 6.45గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 2.10గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9గంటలకు బెంగళూరు వెళ్తుంది. ఈ రైలు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. బెంగళూరు-న్యూటిన్‌సుకియా(05951) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్య రాత్రి 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. ఈ రైలు మే 6 నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సూర్యనారాయణ మూర్తి (ఫైల్)

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక వ్యక్తిని వెనుక నుండి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడని సబ్బవరం సీఐ పిన్నంటి రమణ శుక్రవారం తెలిపారు. వివరాలలోకి వెళ్తే.. సబ్బవరంలోని సాయి నగర్ కాలనీలో కంచిమూర్తి సూర్యనారాయణ మూర్తి (59) తన భార్య రమణమ్మతో కలిసి నివసిస్తున్నారు. ఆయన గురువారం కిరాణా సామగ్రి కొనుగోలు చేసేందుకు సబ్బవరం జంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో కెనరా బ్యాంకు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుండి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సూర్యనారాయణ మూర్తి భార్య స్థానికులతో కలిసి సబ్బవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సిబ్బంది వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com